వార్త







జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎస్‌వీఐటీ ఛైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి, ఇంటర్వ్యూలను పర్యవేక్షిస్తున్న ఛైర్మన్, జైన్‌వర్సిటీ బృందం

# వెనుకబడిన అనంతలో ఉద్యోగాల కల్పనకు ముందడుగు

## - అనంతలో కరువు ఉన్నా ప్రతిభకు కొదవలేదు
## - మెగాజాబ్ మేళాలలో ఎస్‌వీటీఐ కళాశాల ఛైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి

**రాప్తాడు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

దేశంలోనే అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లా కరువుతో సతమతమవుతున్నా ప్రతిభా, నైపుణ్యాలకు కొదవలేదని ఎస్‌వీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి అన్నారు. రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని ఎస్‌వీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎస్‌వీఐటీ విద్యాసంస్థలు, జైన్ యూనివర్సిటీలు సంయుక్తంగా 22 మల్టీనేషనల్ కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలో తమ ప్రతిభను నిరూపించేందుకు బీటెక్, డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతోపాటు 2015, 2016, 2017 సంవత్సరాల్లో డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులు దాదాపు 3వేల మంది హాజరయ్యారు. డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి కరువు జిల్లాలో చదువులో అపార మేధాశక్తి ఉన్న మానవ వనరులకు కొదవలేదని.. ప్రతిభ కలిగిన ఉద్యోగార్థులకు ఉద్యోగాలు కల్పించి తమ తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేందుకు ఈ జాబ్‌మేళాను రెండోసారి నిర్వహించామన్నారు. గతేడాది 2500మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా.. 600మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. ఈఏడాది హాజరైన వారిలో వెయ్యిమందికి ఉద్యోగాలు కల్పించాలనే సదుద్దేశ్యంతో రెండోసారి జైన్ యూనివర్సిటీతో సంయుక్తంగా నిర్వహించామన్నారు. అభివృద్ధి చెందుతున్న నవసమాజంలో యువతీ, యువకుల గౌరవాన్ని కాపాడేలా కృషిచేస్తున్నామన్నారు. వైస్ ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్‌వీఐటీ విద్యాబోధన రాయలసీమకే తలమానికంగా అందిస్తున్నామని.. ఇలాంటి కళాశాలలో పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న విద్యావంతులకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు జైన్ వర్సిటీ రెండు రోజుల సమయం కేటాయించడం హర్షణీయమన్నారు. ఇంటర్వ్యూల్లో నైపుణ్యం, ఏకాగ్రత, పట్టుదల ఉన్నవారికే ప్రాధాన్యమిచ్చి ఉద్యోగం ఇచ్చేలా కంపెనీలకు తగు సూచనలిచ్చామన్నారు. ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జైన్ యూనివర్సిటీ ప్రోత్సాహంతో మెగా జాబ్‌మేళాను నిర్వహించి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేలా తమవంతు కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జైన్ యూనివర్సిటీ హెచ్‌ఆర్ మేనేజర్ జయప్రకాష్‌రెడ్డి, అసోసియేట్ సెంథిల్‌లు మాట్లాడుతూ చదువుకొని నిరుద్యోగులుగా ఉండకుండా వారికి జీవితంపై తగిన భరోసా కల్పించేందుకు ఇలా జాబ్‌మేళాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ ఇంటర్వ్యూల్లో ప్రతిభను పరీక్షించే తరహా ప్రశ్నలు సంధించినా ఉద్యోగ విధుల్లో నైపుణ్యాన్ని పెంచుకునేందుకు దోహదపడేలా ఉన్నాయన్నారు. జాబ్‌మేళాకు హాజరైన వారికి భోజన, రవాణా సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వై.మధుసూదన్‌రెడ్డి, పీడీ శ్రీనివాసులునాయక్‌లు పాల్గొన్నారు.





జాబ్‌మేళాలో పరీక్షలు రాస్తున్న ఉద్యోగార్థులను పరిశీలిస్తున్న వైస్ ఛైర్మన్ బృందం, జాబ్‌మేళాకు హాజరైన ఉద్యోగార్థులు